# శరీరము, మనస్సు, ఆత్మ యీ మూడింటి ఏకత్వముతో జీవించేవాడే మానవుడు

అస్థిరం జీవనం లోకే అస్థిరం యౌవనం ధనమ్
అస్థిరం దారపుత్రాది సత్యంకీర్తిద్వయం స్థిరమ్.

తనదు బాగు కోరి తత్త్వంబు బోధించు
గురుడు తిట్టవచ్చు బాగ కొట్టవచ్చు
తల్లి బుగ్గ గిల్లి త్రాపును మందును
మరువబోకుడిట్టి మంచి మాట.

అన్న దానముకన్న నధిక దానంబేది?
తల్లిదండ్రులకన్న దైవమేది?
జపతపంబులకన్న సత్యశీలంబేది?
దయకంటె నెక్కువ ధర్మమేది?
సుజన సంగతికన్న చూడలాభంబేది?
క్రోధంబుకన్న శత్రుత్వమేది?
ఋణము కంటెను నరునకు రోగమేది?
ధరణి నపకీర్తికంటెను మరణమేది?
సరిగ సత్కీర్తికంటెను సంపదేది?
స్మరణమునకు మించు నాభరణమేది?

sri sathyasai vachanamrutam

దివ్యాత్మ స్వరూపులారా!

పిల్లలు సద్గుణవంతులు కావలెనన్నను, సరైన సంస్కారవంతులుగా తీర్చి దిద్దవలెనన్నను మొదలు తల్లితండ్రులు సద్గుణవంతులుగాను, సరైన సంస్కారవంతులుగాను రూపొందాలి. తల్లితండ్రులు సద్గుణవంతులై సరియైన జీవితము గడుపుచుండినప్పుడే పిల్లలు సద్గుణవంతులవుతారు. ఆర్యాంబ, శివగురువులకు మహాజ్ఞానియైన శంకరాచార్యుడు ఆవిర్భవించాడు. రామకృష్ణ పరమహంసగానీ, వివేకానందులుగానీ దేశవ్యాప్తిగా కీర్తినందుటకు వారి తల్లితండ్రులే ప్రధానమైన కారణకర్తలు.

**బిడ్డలు పవిత్రమైన జీవితము గడుపడానికి తల్లితండ్రులే మూలకారణము**

లోకములోని మహనీయులందరుకూడను తల్లితండ్రుల సంస్కృతిని, గుణగణములను పురస్కరించుకొనియే అట్టి ఉన్నతస్థితికి రాగలుగుతూవచ్చారు. గాంధి కేవలము సామాన్యమైన మానవుడిగా వుండికూడను జాతిపితగా, మహనీయుడుగా, మహాత్ముడుగా పేరు పొందాడు. ఆయన తల్లియొక్క అనుగ్రహము, సంస్కృతియొక్క ప్రతిఫలమే గాంధిని ఆ రీతిగా తీర్చిదిద్దింది. ఆయన తల్లికి ఒక వ్రతము వుండేది. ప్రతిదినము కోయిల కూసిన తరువాతనే తాను ఆహారము తీసుకునే వాడుక. ఒకనాడు గాంధి బాలుడుగా వుండిన సమయములో తల్లి కోకిలకూతకోసమై ఎంతో సమయం కాచుకొని వున్నది. తల్లి యీ కోకిల కూతకై కాచుకొన్న కాలము అధికమవుతున్నదని విశ్వసించి తాను బయటకు వెళ్లి కోకిలవలె ఒక కూతను కూసి 'అమ్మా! కోకిల కూసింది కనుక నీవు యింక భుజించమ'ని అబద్ధము చెప్పాడు, గాంధి. ఈ విషయము చక్కగా గుర్తించిన తల్లి, కుమారుని పట్టి రెండు చెంప దెబ్బలు కొట్టి "దుర్మార్గుడా! యిలాంటి పుత్రుడు నా గర్భములో జన్మించటంచేత నేను ఎంత పాపినో! యిలాంటి పుత్రుడు నాకు జన్మించటము దురదృష్ట"మని విచారించింది. 'అసత్యములాడే కుమారుడు నాకు పుట్టటము నేను ఏ జన్మలో చేసిన పాపమో'నని చాలా బాధ పడింది. ఆ యొక్క విచారము గాంధీ హృదయములోపల నాటుకుంది. అప్పటినుంచి గాంధీ అసత్యమాడకూడదని తాను ఒక పట్టుదల పట్టాడు. గాంధీ చిన్నప్పుడు చాలా

sri sathyasai vahamrutam

భయపడేవాడు. ఆ యింటిలో దాసి రంభ అనే ఆమె వుండేటువంటిది. ఒకనాడు దాసి దగ్గరకు వెళ్ళి 'రంభా! నాకు భయమేస్తున్నది' అని చెప్పాడు. ఆ రంభ చెప్పింది, "రామ రామ అని రామనామస్మరణ చెయ్యి. ఈ రామనామస్మరణచేత నీ భయము దూరమై పోతుంది", అని. ఆనాటినుండికూడను గాంధీ రామనామాన్ని స్మరిస్తూ వచ్చాడు. బాల్యములో ప్రారంభమైన రామనామము అంత్యకాలములోకూడను తన జీవితము రామనామముతోనే అంత్యము గావించాడు. అంతే కాదు, యీ రామనామముచేతనే ఏ విధమైన యుద్ధము లేకుండా అహింస పాటించుకుంటూ కట్టకడపటికి తన సంకల్పమును సాధిస్తూ వచ్చాడు. ఈ విధమైన పవిత్రమైన జీవితమునకు తల్లితండ్రులే మూలకారణము.

**ఈనాడు దేశము ఇంత దురవస్థలో ఉండటానికి మూలకారణము తల్లితండ్రులు, అధ్యాపకులే!**

దురదృష్టవశాత్తు నేటి కాలములో తల్లితండ్రులు పవిత్రహృదయులు కాకపోవటంచేతను, సరైన సంస్కారములు వారిలో లేకపోవటంచేతను ప్రపంచమంతయు దుష్టులు, దుర్మార్గులు, దురాచారపరులు దినదినాభివృద్ధినొందుతున్నారు. ఈనాటి తల్లితండ్రులు తిట్టుకుంటూ నిద్రలేస్తే వారికి పుట్టిన పుత్రులు కొట్టుకుంటూ నిద్రలేస్తున్నారు. కలి ప్రభావముచేత యీనాటి తల్లితండ్రులు కలహకంఠివంటి తల్లులుగా హిరణ్యకశిపునివంటి తండ్రులుగా తయారౌతున్నారు. యిలాంటి తల్లితండ్రులు అభివృద్ధి గావటంచేత భారతదేశములోపల మహా అశాంతికి గురై అక్రమాలు, అనాచారములు అభివృద్ధి అవుతూవస్తున్నాయి. పూర్వము అనేకమంది సద్గుణవంతులుగాను, సదాచారవంతులుగాను, సన్మార్గవంతులుగాను అభివృద్ధియై భారతదేశముయొక్క కీర్తిని జగత్వ్యాప్తి గావించుకుంటూ వచ్చారు. గంతకు తగిన బొంత అని తల్లితండ్రులకు తగిన బిడ్డలు యీనాడు పుడుతున్నారు. చెట్టునుబట్టి విత్తనము, విత్తనముబట్టే చెట్టు. కనుక యీనాటి పిల్లలయొక్క దుర్మార్గమునకు, దుష్టప్రవర్తనకు మూలకారణము తల్లితండ్రులే! తమ బిడ్డలకు సత్యమును పలకమని, ధర్మముగా నడచుకోమని, సత్కీర్తిని సాధించుకోమని ఏ తల్లితండ్రులుకూడను నేడు బోధించటంలేదు. ఇలాంటి దుర్మార్గులైన తల్లితండ్రులు

srisathyasaivachanamrutam

అభివృద్ధికావటంచేతనే దేశము అపకీర్తిపాలైపోతున్నది. అలాంటి పుత్రులు పుట్టటంకంటె చావటం మంచిది. తల్లితండ్రుల గౌరవమును తీస్తూ దేశముయొక్క సత్కీర్తిని నాశనము చేస్తున్నారు. వారు చదివే చదువులుకానీ, వారు చేసే ఉద్యోగములుగానీ కేవలము కలిమి, చెలిమి, బలమును పెంచుకునే నిమిత్తమై ప్రాకులాడుతున్నారేగానీ, దయ, ప్రేమ, దైవతత్వమును యేమాత్రము మనస్సులో చేర్చుకోటంలేదు. ఏమిటీ యీ కలిమి? ఎంతబలము వుండి యేమి ప్రయోజనము? యీ బలము, యీ కలిమి, యీ చెలిమి శాశ్వతము కావు.

**బుద్ధి బలము మరియు భుజబలమున్నను**
**దైవ బలము లేక దీనుడగును**
**కర్ణుడంతవాడు కడపటికేమయ్యె**
**మరువబోకుడిట్టి మంచి మాట.**

తనకు భుజబలము, బుద్ధిబలము, విద్యాబలము కావలసినంత వున్నది. కానీ, దైవబలము కోల్పోవటంచేతనే ఆ విధమైన దురవస్థకు గురియైపోయాడు. కనుక, యీనాడు దేశమునందు దురవస్థలకు మూలకారణము తల్లి, తండ్రి, అధ్యాపకులే!

## నైతిక, ఆధ్యాత్మిక విలువలు లేకపోతే మానవత్వము కేవలము దానవత్వముగా మారిపోతుంది

ఈనాటి అధ్యాపకులుకూడను విద్యార్థిని శిక్షించటం లేదు. విద్యార్థులకు శిక్ష లేకపోవటంచేతనే తమ వేషములు మితిమీరిపోవుచున్నవి. విద్యార్థులు దుర్మార్గములో ప్రవేశించటము, యీ పాపఫలము అధ్యాపకులదే! వారు సరైన మార్గమును బోధించటములేదు. ఏదో కేవలము గ్రంథపరిచయమును మాత్రమే చేస్తున్నారుగానీ విజ్ఞాన, సుజ్ఞాన, ప్రజ్ఞానతత్త్వమును, చక్కగా వినయ విధేయతలతో నడచుకొనే మార్గమును బోధించటము లేదు. నైతిక విలువ, ఆధ్యాత్మిక విలువ లేకపోతే మానవత్వము కేవలము దానవత్వమనే చెప్పవచ్చును. శరీరము, మనస్సు, ఆత్మ యీ మూడింటి ఏకత్వముతో జీవించేవాడే మానవుడు. దేహమును మాత్రమే అనుసరించి, దేహేంద్రియ



srisathyasaivachanamrutam

సుఖములు మాత్రమే ఆశించి, జీవించేటువంటిది కేవలము ఒక మృగము లేక పశువు. అదే విధంగా మనసును మాత్రమే అనుసరించి సంకల్పవికల్పములతో తమ అభీష్టములు నెరవేర్చుకునే నిమిత్తమై జీవించేవాడు రాక్షసుడు. శరీర, మనస్సులను ధిక్కరించి ఆత్మనే లక్ష్యమునందుంచుకొని మానవత్వాన్ని సార్థకము గావించేవాడు, దైవసమానుడు. కనుక, మానవత్వమునందే దానవత్వము, పశుత్వము, మృగత్వము మూడుకూడను యిమిడి వుంటున్నవి. దేహాన్నిమాత్రమే అనుసరించి, దేహేంద్రియ సుఖములు మాత్రమే ఆశించి, జీవించేవాడు పశువుతో సమానము. పశువే మేలని చెప్పవచ్చును. ఈ పశువుకైనా ఒక విధమైన సీజన్, రీజన్ వుంటుంది. కానీ మానవాకారము ధరించికూడా కేవలం యీ యింద్రియముల సుఖమును ఆశించేవాడు పశువుకంటే హీనమనే చెప్పవచ్చును. తన అభీష్టాన్ని నెరవేర్చుకునే నిమిత్తమయి సంకల్పవికల్పములతో కూడినటువంటి మనసును మాత్రమే ఆశ్రయించేవాడు కేవలం దానవుడనే చెప్పవచ్చును. కాని, మనోయింద్రియములనేమాత్రం చింతించక ఆత్మతత్త్వాన్ని మాత్రమే విశ్వసించి, ఆత్మానంద నిమిత్తమయి జీవించేవాడు దైవసమానుడు. యీ మూడింటికీ మూలకారణం తల్లి, తండ్రి, గురువులే! మంచి, చెడ్డలకు మూలకారణంకూడా యీ ముగ్గురే! ఉన్నతస్థాయికి గొనిపోయేవారు తల్లితండ్రులే! అథఃస్థాయికి దింపేవారుకూడా తల్లితండ్రులే!

## ధృతరాష్ట్రులవంటి తండ్రులు ఉండటంచేతనే పిల్లలు పెడమార్గం పడుతున్నారు

ఈనాటి తల్లితండ్రులు కేవలం భౌతిక అభివృద్ధులను మాత్రమే ఆశిస్తున్నారు కాని హృదయసంబంధమయిన ఆనందాన్ని వారేమాత్రం ఆశించటం లేదు. 'బిడ్డ పుట్టిన తక్షణమే బాగా చదివించాలి, చదివించిన తర్వాత విదేశాలకు పంపాలి, విదేశాలకు పంపిన తర్వాత ధనమును కొల్లలుగా దొంగిలించుకుని రావాలి, ఏ రకముగానైనా ధనమును సంపాదించాలి,' యీ తుచ్ఛమైన ధనవాంఛలే యీనాటి పిల్లలకంతా తల్లితండ్రులు బోధిస్తున్నారు. ధనమును సంపాదించటం బస్‌స్టాండ్‌లో బెగ్గర్సుకూడా చేస్తున్నారు. కేవలం ధనమును సంపాదించాలంటే నక్సలైట్లుకూడా ధనాన్ని సంపాదిస్తున్నారు. భిక్షగాళ్ళుకూడా ధనమును సంపాదిస్తున్నారు. ధనమును సంపాదించటానికి యిన్ని విధములైన శ్రమలు

sri sathyasai vahanamrutam

పడనక్కరలేదు. గుణమును సంపాదించాలి. అలాంటి గుణమును సంపాదించే బోధలు యీనాడు తల్లితండ్రులు చేయటంలేదు. ఏ దుర్మార్గములో ప్రవేశించిన కుఱ్ఱవాడినైనా హెచ్చరించటం లేదు. తమ పుత్రులు చేసిన దోషములను, తప్పులను క్షమించుకుంటూ వారిని మెచ్చుకుంటూ వస్తున్నారు. దర్యోధనదుశ్శాసనులమాదిరి వాళ్లు పెరిగిపోతున్నారు. ఇలాంటి దృతరాష్ట్రులవంటి తండ్రులు వుండటంచేతనే పిల్లలు యీ విధమైన పెడమార్గం పడ్తున్నారు. దృతరాష్ట్రునికి కేవలం చర్మచక్షువులు మాత్రమేకాదు, జ్ఞానచక్షువుకూడా లేదు. వాడు పూర్తి అంధుడు. అలాంటి అంధునివలె తయారవుతున్నారు, యీనాటి తండ్రులు. పిల్లలు చేసిన దోషాన్ని వారేమాత్రం ధిక్కరించటంలేదు. ఇది తప్పని బోధించటం లేదు. ఈ విధంగా బోధిస్తే పిల్లలేమయిపోతారో, ఎక్కడికి వెళ్తారో, ప్రాణం తీసుకుంటారేమోనని భయపడ్తున్నారు, యీ వెఱ్ఱి తల్లితండ్రులు. దండించటం నీయొక్క ధర్మం. నీయొక్కహక్కు. ఏమైపోతారేమోనని భయపడటం ఎందుకు? అలాంటి దుర్మార్గులైన కుమారులు ఏమయిపోయినా దోషం లేదు. జీవితమంతా తల్లితండ్రులను బాధపెట్టే బదులు యీ విధంగా మరణించినా మంచిదే! కనుక యీ విధమైన విచారం ఎందుకు పడాలి? పిరికిపందలయి తల్లితండ్రులు కుమారులు ఏమైపోతారోనని భయపడ్తున్నారు. ఏమైతే ఏమి నష్టము? ధరణి అపకీర్తి కంటెను మరణమేది? సర్వదా కీర్తికంటెను సంపదేది? ఈ అపకీర్తుల పాలయ్యే కుమారులకంటే, కీర్తిని తెచ్చే చిన్న జీవితమైనా చాలు.

## మానవుడు ప్రప్రథమంగా సాధించవలసినది భగవత్ప్రేమ

ఈనాడు మానవుడు ప్రప్రథమంలో సాధించవలసింది ఏమిటి? ప్రప్రథమంలో మానవుడు సాధించవలసింది భగవంతుని ప్రేమ. ఈ ప్రేమయే జగత్‌శాంతిని, సమాజ శాంతిని, గృహశాంతిని అందిస్తుంది. వ్యక్తియొక్క సద్గుణములచేత, ప్రేమచేత కుటుంబము శాంతి, భద్రతలనొందుతుంది. సమాజములోని ప్రజలు భగవత్ ప్రేమను సాధించటంచేత సమాజము సుఖశాంతిని పొందుతుంది. ప్రజలే భగవంతుని ప్రేమను సాధించినపుడు విశ్వమే సుఖశాంతిని పొందుతుంది. సుఖశాంతులనేవి కేవలం ధనమునందుకాని, బలమునందుకాని, పదవులయందుకాని లేవు, లేవు, లేవు. ఈ ధనము, ఐశ్వర్యము, పదవి,

srisathyasaivahini.in

బలము యివన్నీ కేవలం భయమును, అశాంతిని అందిస్తున్నవికాని శాంతి, నిర్భయములనేమాత్రం కూర్చటం లేదు. ఈనాటి గొప్ప గొప్ప విద్యావంతులుకూడా యీ విధమైన సత్యాన్ని గుర్తించలేక భక్తులవలె నటిస్తూ దుష్టులైన తల్లితండ్రులను అనుసరిస్తూ వస్తున్నారు. హిరణ్యకశిపునికంటె దుర్మార్గుడు మరొకడు లేడు. అతడు తన కుమారుడైన ప్రహ్లాదుని భగవత్‌మార్గంనుండి ప్రపంచమార్గంలోకి మార్చాలని అనేక ప్రయత్నములు చేశాడు. చండ, అమార్కులకుకూడా గట్టిగా శాసనం యిచ్చాడు, "నా కుమారునికి విద్యలు బోధించనక్కరలేదు. లౌకిక సంబంధమైన గుణములు బోధించండి. కామక్రోధలోభమోహమదమాత్సర్యములనే అరిషడ్వర్గములను బోధించండి," అని చెప్పాడు. ప్రహ్లాదుని దేహమునకు కావలసినన్ని ప్రమాదములు కల్గించాడు. పాములచే కరిపించాడు. ఏనుగులచే త్రొక్కించాడు. సముద్రంలో పడవేశాడు. కాని దైవభక్తియే ఆ ప్రహ్లాదుని సర్వవేళలా రక్షిస్తూ వచ్చింది. తండ్రియైనను ఫరవాలేదని దుర్మార్గమును ధిక్కరించి దైవాన్ని ఆశ్రయించాడు, ప్రహ్లాదుడు. ఎవడు తండ్రి? కేవలం కన్న తర్వాత తండ్రియా? అది గొప్పతనమా? కుక్కకుకూడా పది పిల్లలు పుడుతున్నాయి. నీకంటే కుక్కయే మేలే! కాబట్టి, కుమారులను కన్నంతమాత్రాన తండ్రి అవుతాడా? కాదు, కాదు.

**మానవత్వాన్ని ప్రకటింపజేసే విద్యలు లేకపోవటమే ఈనాటి భారతదేశపు దుస్థితికి కారణం**

పుత్రోత్సాహం తండ్రికి పుత్రుడు జన్మించగానే పుట్టదు. 'జనులు ఆ పుత్రుని కనుగొని పొగడగ పుత్రోత్సాహంబు నాడు పొందును తండ్రీ!' 'వెలయు వనములోన మలయజంబున్నట్లు' గొప్ప అడవిలో సుగంధమునిచ్చే మల్లె తీగ ఒకటివుంటే వనమంతా సుగంధాన్ని అందిస్తుంది. అదే వనములో దుర్గంధము నందించే లతయే వుంటే అడవికంతా దుర్గంధమునందిస్తుంది. 'కులములో ఒక్కడు గుణవంతుడుండిన గుణము వెలయు, వాని కులము వెలయు'. కనుక, అట్టి సత్కుమారుడిని, సత్‌పుత్రుడిని, సత్ సంప్రదాయం కల్గినవానిని అందించేవారే తల్లితండ్రులు. 'హరిచేరుమనియెడి తండ్రి తండ్రి' అన్నాడు, ప్రహ్లాదుడు. 'కుంభీనీధవు చెప్పెడి గురుడు గురుడు', అన్నాడు. అలాంటి గురువులు, అలాంటి తల్లితండ్రులు యీనాడు కరువయిపోయారు. కనుకనే

sri sathyasai vachanamrutam

యుగయుగములనుండి, తరతరములనుండి భారతదేశమునకు సత్‌కీర్తిని ఆర్జించి కీర్తి తెచ్చినదంతా యీనాడు వ్యర్థమైపోతుంది. కారణము, సరియైన సంస్కారం కోల్పోవటమే! తుచ్ఛమైన విద్యలభ్యసించటమే ఒక కారణం. మానవత్వాన్ని ప్రకటింపచేసే విద్యలు లేకపోవటమే ఒక కారణం. మానవత్వానికి మకుటమైన గుణములు లేకపోవటమే ఒక కారణము. దివ్యమైన, భవ్యమైన, భావములు మానవునియందు లేకపోవటమే ఒక కారణము. ఎప్పుడు చూచినా సంకుచిత భావములతో కుళ్ళిపోతున్నాడు, మానవుడు. ఎంత ధనముండినా, ఎంత సుఖముండినా, ఎంత ఐశ్వర్యముండినప్పటికీ కేవలం మానవుడు ఆనందంగా వున్నట్లు నటిస్తున్నాడేగానీ, నిజమయిన ఆనందం అతనిలో ఏమాత్రం కన్పించదు. ఆర్టిఫిషియల్ లైఫ్, కృత్రిమమైన జీవితాన్ని అనుభవిస్తున్నాడు. కేవలం మానవుడని పేరు పెట్టుకుని పశువువలె జీవించటం, నిజమయిన భగవత్‌భక్తి లేకపోవటం, యిది మానవత్వానికి సరియైనది కాదు.

## భగవత్ప్రేమను సాధించినవానికి లోకములో సాధించవలసినది ఏమీ లేదు

"భగవాన్" అనగా ఏమిటి? ఇది మెప్పులకోసం పెట్టిన పేరు కాదు. ఏదో ఒక విధంగా యితనికి యిచ్చిన బిరుదుకాదు. "బ్రహ్మేతి, పరమాత్మేతి, భువనేతి శబ్దః" అన్నది వేదం. అనగా బ్రహ్మ, పరమాత్మ అనే దానికి చివరయైనటువంటిదే యీ భగవాన్ అనే కీర్తి. భగః-అనగా 'సంభర్త' అని, 'భర్త' అని రెండు అర్థములు. 'సంభర్త' అనగా ప్రకృతినాధారం చేసుకుని సృష్టించటం. ఈ సృష్టించిన దానిని బాధ్యతవహించి కాపాడేవాడు భర్త. అనగా సృష్టి, పోషణ యీ రెండు శక్తులు కలవాడే భగవంతుడు అని. భగవంత-'భ' అనగా కాంతి, శాంతి. 'గ' అనగా వ్యాపింప చేసేవాడు. 'వంతుడు' అనగా సమర్థుడు. అనగా ప్రపంచమునకు శాంతిని, కాంతిని వ్యాపింపచేసే సమర్థుడే భగవంతుడు. ఇలాంటి భగవత్ తత్త్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుందుకు ప్రయత్నించటం లేదు, మానవుడు. భగవంతుడు తప్ప యీ జగత్తులో మరొకటి లేదు. కాని అన్నింటియందు, కేవలం భగవత్ శక్తియే సర్వవ్యాపకమై వుంటున్నది.

'నేను చేశాను,' 'నేను చూశాను,' 'నేను అనుభవించాను' అనేటువంటి యీ

srisathyasaivachanamrutam

కర్తృత్వభోక్తృత్వములుండినంతవరకూ యీ అహంకారమనేది మానవుడిని అణగద్రొక్కుతూ వుంటుంది. ఈ అహంకారాన్ని మనం అణగద్రొక్కాలి. దివ్యత్వాన్ని మనం ఆవిర్భవింపచేసుకోవాలి. అప్పుడే మనకు జగత్తునందు సర్వవిధములైన శాంతి, సంతోషాలు సమకూరతాయి. కనుక, భగవంతుని ప్రేమను, పవిత్రతను అనుభవించటానికి తగిన కృషి చేయాలి. భగవత్ ప్రేమను సాధించినవానికి లోకంలో సాధించవలసినది మరొకటి ఏమాత్రం లేదు. కనుక, భగవత్ అనుగ్రహానికి పాత్రుడు కావాలి. భగవత్ అనుగ్రహానికి పాత్రుడు కానటువంటి మానవజీవితం కేవలం పశుత్వంగా జీవించటం మాత్రమే అవుతుంది. ఇంద్రియ సుఖాలకోసం ప్రాకులాడుతున్నాడు, మానవుడు. యీ విధంగా యింద్రియ సుఖాలకోసం ప్రాకులాడే మానవులకు, పశు, పక్షి మృగాదులకు ఏమాత్రం వ్యత్యాసం లేదు. ఇట్టివానికింక చదువులెందుకు? ఆహారనిద్రాభయాదులు మానవులకు, పశువులకు సమానమే! 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. ఇంక యిందులో వీనిలో ప్రత్యేకత ఏమిటి ఏడ్చింది, నరజన్మ దుర్లభం అనటానికి! ఏమీ దుర్లభం లేదు. ఇది కాదు దుర్లభం. ఇంద్రియాలను నిగ్రహించి, ఆదర్శవంతమైన జీవితాన్ని అందించి, సద్గుణములను పెంచుకుని, సదాచారములో ప్రవేశించి, ఆదర్శంగా జీవించాలి. అదియే నిజమైనది. అట్టి ఆదర్శవంతమైన జీవితానికి తల్లితండ్రులే మూలకారణం. కనుక తల్లులు, తండ్రులు తమను తాము చాలా గుణవంతులుగా తీర్చిదిద్దుకోవాలి. ఈనాడు దేశంలో ఎక్కడ చూసినా కుమారుని చేష్టలగురించి తల్లితండ్రులు బాధపడ్తున్నారే తప్ప, ఆనందాన్ని అనుభవించటం లేదు. పిచ్చివారు! నా కుమారులు సరిలేరని ఏడుస్తున్నారే తప్ప, దీనికి కారణం ఎవరు? తామే! తాము సరియైన రీతిలో పెంచివుంటే యీ కుమారులీ విధమైన దానిలో ప్రవేశించేవారు కారు కదా! అడిగినంత ధనము చేతికిచ్చి, కోరినట్లుగా కార్లు చేతికిచ్చి, కుక్కలవలె తిరగమని స్వేచ్ఛనందిస్తున్నారు, తల్లితండ్రులు. ఇలాంటి కుమారులు బాగుపడాలంటే ఎలా బాగుపడ్తారు? అసాధ్యము, అసాధ్యము.

**ధనము పెరిగే కొద్ది మానవునికి గుణం తరుగుతున్నది**

**ధనమెచ్చిన మదమెచ్చును**

**మదమెచ్చిన దుర్గుణములు మానక హెచ్చున్**
**ధనముడిగిన మదముడుగును**
**మదముడిగిన దుర్గుణములు మానును వేమా!**

అన్నారు. ధనము పెరిగేకొద్దీ మానవునికి గుణం తరుగుతున్నది. ఈ గుణము తరిగేకొలదీ అహంకారం పెరుగుతోంది. అహంకారం పెరిగేకొలదీ వివేకము, జ్ఞానం క్షీణిస్తాయి. విజ్ఞానమనేది, విచక్షణ అనేది శూన్యమైపోతోంది. తన అనుకూలమును బట్టి discrimination చేస్తున్నాడేతప్ప సత్యమైన discrimination కు తాను ప్రయత్నించటంలేదు. తనలోని సత్యాన్ని తాను గుర్తించటానికి భయపడుతున్నాడు. కారణం ఏమిటి? తనలో సత్యములేదు. 'సత్యంకీర్తిర్ద్వయం స్థిరమ్'. యీ రెండే ప్రధానమైనవి, కనుక ప్రేమస్వరూపులారా! మానవజీవితము చాలా దుర్లభమైనది. చాలా విలువైనది. జీవించతగినటువంటిది. యిలాంటి విలువైన జీవితాన్ని మనం వ్యర్థం చేసుకుంటున్నాము. దేహమే ప్రధానముగా భావిస్తున్నాము.

**విలువలేని యినుప పెట్టె ఈ దేహము**
**పెట్టెలోన నగలు పెట్టినట్లు**
**దేహమందు ఆత్మదేవుడుండెను సుమా**
**సత్యమైన బాట సాయి మాట.**

దేహమనేది ఒక పనికిరాని, విలువలేని పెట్టె. కానీ అందులో సద్గుణములు, సదాచారములు అనేటువంటి ఆత్మ గుణములంతా వుంటున్నాయి. దాని నిమిత్తమై మనం యీ దేహమును పోషించుకోవాలి. ఈనాడు ఆ గుణములను విస్మరించి కేవలం యినుప పెట్టెను పట్టుకొని వేళ్ళాడుతున్నాడు, మానవుడు. యీ దేహము నీటి బుడగవంటిది. యీలాంటిదానిని మనం నమ్ముకోకూడదు. గుణములను ఆదర్శముగా మనం తీసుకోవాలి. దైవప్రేమను సంపాయించిన జీవితమే జీవితముగానీ దానిని పోగొట్టుకున్న జీవితము జీవితమే కాదు. పక్షియైన జటాయువుకూడను దైవప్రేమను సాధించింది. కేవలము విద్యలేని ముసలి స్త్రీ దైవప్రేమను సాధించింది. కాని, మానవుడు యీనాడు సకల విద్యావంతుడైపోయి

sri sathyasai vachanamrutam

వైజ్ఞానికుడై దైవప్రేమకు యేమాత్రము ప్రాకులాడటంలేదు. ఏమిటి యీ చదువు? ఏమిటి యీ విజ్ఞానము? పరులను చంపటం విజ్ఞానమా? కాదు, కాదు; దేశమును వుద్ధరించేది విజ్ఞానము. కేవలము సైన్సు, సైన్సు అని పేరు పెట్టుకొని దేశమును భస్మముగావిస్తున్నారు. పరులను హింసించుటకు గొప్ప ప్రయత్నము చేయనక్కరలేదు. పాముకూడను కరచి చంపేస్తుంది, మనిషిని. తేలుకూడను మనిషిని కరచి చంపేస్తుంది. పాము, తేలు, క్రిమికీటకాదులే చంపుతుంటే, యీ సైంటిస్టు ప్రజలను చంపటంలో గొప్పతనమేమిటుంది? ఒక్క బాంబువేస్తే ప్రపంచమంతా భస్మమై పోతుందట! 'ఆ భస్మములో తానుకూడా భస్మమవుతాడు,' అనే విజ్ఞానము లేకుండాపోతున్నాది. కనుక, 'చెడపకురా చెడెదవు' అన్నారు. యితరులను చెడిపే విద్యలు యేమాత్రము గొప్పవి కావు. పరులను మోసగించి పొట్టను పోషించుకునే విద్యలు విద్యలుకాదు. గుణమును పోషించు, గుణమును ప్రచారము చేయి!

## దైవాన్ని విశ్వసించటంచేతనే పాండవులు సుఖ, శాంతులు పొందగలిగారు

యీనాడు మీరు బాలురుగా వుండవచ్చును. రేపు మీకు కుటుంబము ఏర్పడ వచ్చును. మీరు మంచివారైనప్పుడే మీ పుత్రులుకూడను మంచివారౌతారు. నీవే సరిగా లేకపోతే చెట్టుకు తగిన విత్తనాలే వస్తాయి. మీకుకూడను అపకీర్తి పాలుచేసే కుమారులే పుడతారు. దైవప్రేమకు మనము దూరమైపోయామంటే దానవులే మన పుత్రులుగా పుడతారు. కనుక, దైవప్రేమను సాధించటానికి తగిన కృషి చేయండి. లోకసంబంధమైన సుఖసంతోషాలు తాత్కాలికము. యివి శాశ్వతమైనవి కాదు. సత్యనిత్యమైన దైవప్రేమను మనం సాధించాలి. అది కోల్పోవటంచేతనే దేశము యిన్ని అవస్థలకు గురియైపోతున్నది. గతంలో దేశము యిన్ని అవస్థలకు యేనాడూ గురికాలేదు. ఆనాడు కేవలము న్యాయముకోసము, ధర్మముకోసం, సత్యముకోసం, దైవముకోసం జీవించేటువంటివారు. అందువలనే అర్జునునకు బోధించాడు, కృష్ణుడు: "ధర్మము, దైవము యీ రెండే నీకు ప్రధానము. అడవులపాలైనా పరవాలేదు. అర్జునా! ధర్మమునను సరించు, దైవమును విశ్వసించు", అని. పాండవులు ఆనాటినుండి కట్టకడపటివరకు దైవాన్ని విశ్వసించటంచేతనే వారు అన్ని

sri sathyasai vahini amrutam

సుఖములు, అన్ని శాంతులు పొందారు. ఎన్ని కష్టములు వచ్చినప్పటికి దైవప్రేమచేత ఆ కష్టములు సహించుకోగలిగారు, భరించుకోగలిగారు. దైవమును విశ్వసించకపోవటంచేత కౌరవులు ఏ గతి పొందారు? నూర్గురు పుత్రులున్న ధృతరాష్ట్రునికి చివరకు ఒక్క కుమారుడుకూడా లేకపోయాడు. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు బలహీనుడై నేను యింక యుద్ధము చేయనని చెప్పి గాండీవమును క్రింద విడచినప్పుడు శ్రీ కృష్ణుడు ఇలా చెప్పాడు:

**లెమ్ము ధనుంజయా! విధిబలీయము న్యాయము గెల్చు, నిల్చు స**
**త్యమ్ము నశించు స్వార్థము సదా యుగధర్మమిదే గదోయి క**
**న్గొనుమిక నంత్యకాలమున నూర్గురు బిడ్డల తండ్రికైన పిం**
**డమ్మిడు దిక్కుకల్గదక్కటా గ్రహచారము తప్పివచ్చినన్.**

కౌరవులు యీ విధమైన అవస్థలకు గురియైపోయారు. కావలసినంత ధనము. కావలసినంత బలము. గొప్ప గురువులే సైన్యాధిపతులుగా నిల్చారు. ద్రోణాచార్యుడు వారివైపునే వుంటున్నాడు. అశ్వత్థామ వారివైపునే వుంటున్నాడు. భీష్ముడు వారివైపునే వుంటున్నాడు. ఎవరుండి ఏమి ప్రయోజనము? భగవంతుడు వారివైపున లేడు. భగవంతుడు పాండవులవైపునే వుంటున్నాడు. కనుకనే పాండవులకే విజయము చేకూరింది. భగవద్గీతను తీసుకున్నప్పుడు మొట్టమొదట ధర్మముతో ప్రారంభించి, విజయముతో అంత్యము గావించాడు, అదే భగవద్గీత:

**ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యయుత్సవః**
**మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయా**

చివరకు

**యత్ర యోగేశ్వరఃకృష్ణ యత్ర పార్థోధనుర్ధరః**
**తత్రశ్రీర్విజయో భూతి ధ్రువా నీతిర్మతి ర్మమ**

విజయమును సాధిస్తాము అని కట్టకడపటికి అంత్యము చేశాడు.

**దైవానుగ్రహముతో కలిగే విజయమే విజయము**

srisathyasaivahini.org watermark: srisathyasaivachanamrutam

ఏమిటి మన విజయాలు యీనాడు? క్లాసులో పాసైన తక్షణమే విజయమా? మార్కులు తెచ్చుకుంటే విజయమా? ఒక కార్యము చేస్తేనే విజయమా? యివికాదు మన విజయములు. జీవితవిజయాన్ని సాధించాలి. డబ్బు యిచ్చి మార్కులు వేయించుకోవచ్చు. యింకేవిధముగానైనాచేసి మార్కులు వేయించుకోవచ్చు. లంచాలు యిచ్చి పనులు చేయించుకోవచ్చు. అదికాదు విజయము. దైవానుగ్రహముతో కలిగే విజయమే విజయము! అట్టి విజయమును సాధించినవాడే దిగ్విజయుడు. అతనే ఒక రాజు. అతనే రారాజు. రాజులకు రాజు మహారాజాధిరాజు. అలాంటి దైవానుగ్రహమును పొందినవాడు నిజమైన మహారాజు. మీకందరికి తెలుసును. ఉత్తరప్రదేశ్‌లో ప్రతి సన్యాసిని 'మహారాజ్,' 'మహారాజ్' అంటారు. 'మహారాజ్' అంటే ఏమిటి? దైవచింతన చేసేవాడు మహారాజ్. కనుకనే ఆ సన్యాసులనందరిని 'మహారాజ్! మహారాజ్!' అంటారు. అయితే, దురదృష్టవశాత్తు ఆ మహారాజ్‌లు చాలామంది ఈనాడు దుర్మార్గములో ప్రవేశిస్తున్నారు. కాషాయవస్త్రము వేసుకొని సిగరెట్టు కాలుస్తుంటే, 'మహారాజ్! మహారాజ్! నాకూ ఒక సిగరెట్టు యియ్యి' అంటాడు. గంజాయి త్రాగే సన్యాసులనుకూడా 'మహారాజ్!' అంటారు. ఈ మహారాజ్‌కు విలువనే లేకుండా పోయింది. కనుక, అది కాదు మహారాజు. రాజులకు రాజు మహారాజ్! ఆ 'మహారాజ్' అనే దైవమును హృదయములో నింపుకోవాలి. భగవంతుని రూపమును హృదయములో నింపుకున్నవాడు నిజమైన మహారాజ్! అలాంటి ప్రేమను మనం సంపాయించుకోవాలి. మన ప్రేమనంతా పాడు మార్గములో ప్రవేశపెడుతున్నాం. యితరుల జీవితమును నాశనము చేయటంలో మనం ప్రవేశపెడుతున్నాము. నీ యింద్రియముల తృప్తి నిమిత్తమై నీ ప్రేమను వుపయోగపెడుతున్నావు. పవిత్రమైన భగవత్ప్రేమను నీవు దుర్మార్గములో ప్రవేశపెడుతున్నావు. కనుకనే దాని దుష్ఫలముగా అనేక విధములైన బాధలు సంభవిస్తున్నాయి. యిది తప్పినది కాదు. సన్మార్గములో ప్రవేశపెట్టినప్పుడే యీ ప్రేమకు ఒక ఫలితము వుంటున్నాది.

### సత్కీర్తిని తెచ్చే కుమారులను కన్న తల్లియే తల్లి

ప్రేమకు, అనురాగమునకు చాలా వ్యత్యాసముంటున్నాది. భగవంతునిపైన

sri sathyasai vahanamrutam

పెట్టినటువంటిదే ప్రేమ. మిగతాదంతా ప్రేమకాదు, అనురాగము. అనురాగమనగా భౌతిక సంబంధాలు, కేవలము దేహ సంబంధాలు, ధన సంబంధాలు. యీ కారణమును పట్టుకొని ఒకరినొకరు ప్రేమించుకొనేది అనురాగమే! గార్గి, మైత్రేయి వీరందరు అక్కచెల్లెండ్రు. మైత్రేయి, యాజ్ఞవల్క్యుని భార్య. రెండవ భార్య కాత్యాయని. కాత్యాయని, మైత్రేయి యిద్దరు భార్యలు యాజ్ఞవల్క్యునకు. అతనికి మానసిక వైరాగ్యము సంభవించింది. 'ఎంతకాలము నేను యీ బురదలో చిక్కుకొని వుండాలి? ఈ మలినపుకొంపలో నేను ఎంతకాలము బ్రతకాలి? దివ్యమైన, భవ్యమైన మార్పు నాకు లేదా?' అని ఒకతూరి తీవ్రవైరాగ్యము వచ్చింది. 'యిదిగో నా ఆస్తిపాస్తులు మీకిద్దరికి సమంగా పంచియిస్తున్నా'నన్నాడు. అప్పుడు మైత్రేయి 'ఎందుకోసం యీ ఆస్తి నాకు' అని అడిగింది. 'నీవు సుఖపడవచ్చు జీవితములో' అన్నాడు. అప్పుడు మైత్రేయి మళ్లీ 'ఆ సుఖమే వుంటుంటే నీవు ఎందుకు ఇక్కడ వుంటూ వుండకూడదు? ఈ ఆస్తిపాస్తులలో సుఖమే కనుక వుంటే నీవు ఎందుకు విసర్జించి పోతున్నావు'? 'నీకు లేని సుఖము నాకు యీ ఆస్తిపాస్తులలో లభిస్తుందా? యిది నేను నమ్మను. ఈ ఆస్తిపాస్తులు మనకు బంధనగా ఏర్పడి అవే మనకు వురిగా తయారౌతున్నాయి. కట్టకడటపటికి మన గొంతుకు వురివేసేది అదే! ఈ అభిమానమమకారములే మన గొంతుకు వురి వేస్తున్నాయి. కనుకనే నేను త్యాగము చేస్తున్నాను. అక్కరలేదు. నాకు కావలసింది ఒక్క భగవంతుడే! కనుక, నీ కంటె ముందుగా నేనే బయలుదేరుతున్నాన'ని చెప్పింది, మైత్రేయి. అప్పుడు యాజ్ఞవల్క్యుడు చెప్పాడు, 'యిలాంటి సతి వుండటంచేతనే నాయొక్క జీవితము శాంత జీవితముగా గడుపుతూ వచ్చాను' అని. అలాంటి సతి, యిలాంటి పతి యిద్దరూ వుండినప్పుడే జీవితమునకు శాంతి. అలాంటి దంపతులు యీనాడు చాలా కరువైపోయారు. అలాంటి దంపతులు తయారుకావాలి. అలాంటి దంపతులకే సత్పుత్రులు కలగాలి. అలాంటి సత్పుత్రులే దేశానికి సత్కీర్తిని తెస్తారు. కనుక, సత్కీర్తిని తెచ్చే కుమారులు కుమారులుగానీ, అలాంటి కుమారులను కన్న తల్లులు తల్లులుగానీ, లేకుండా పోతే అలాంటి తల్లులు తల్లులే కాదు.

**చేతులారంగ శివుని పూజింపడేని**
**నోరు నొవ్వంగ హరి కీర్తి నుడువడేని**

srisathyasai vahanamrutam

**దయయు సత్యంబు లోనుగా దలపదేని**
**పుట్టనేటికి తల్లుల కడుపుచేటు**
**అవతార పురుషులను కన్న తల్లులు ఎంత గొప్పవారో యోచన చెయ్యాలి**

సత్కర్మలు చేసే చేతులుండాలి, కుమారునికి. దైవచింతన చేసే నాలుక వుండాలి. సత్యము, ధర్మము తలచే మనసు వుండాలి. యివే త్రికరణశుద్ధి. యీ త్రికరణశుద్ధి లేక నాలుక వుంటుండాది ఎందుకోసం? కప్పలు ఎప్పుడూ నాలుకను అల్లాడిస్తూ వుంటాయి. గొంతు శబ్దము చేస్తుంటాది. ఆ విధంగా మన కంఠము, మన నాలుక, కేవలము కప్పల నాలుకవంటిదిగా వుంటుండాది. పరుల మాటలలోనే మన కాలమును వ్యర్థము చేస్తున్నాము. చేతులు, దుర్మార్గమైన పనులు చేస్తున్నాయి. చెడ్డ పనులలో ప్రవేశపెడుతున్నారు చేతులు. ఎందుకు యీ చేతులు? యిలాంటి చేతులు వుండేదానికంటె మొద్దుచేతులుగా వుంటే మంచిది. పరోపకార సంబంధమైన పనులలో ప్రవేశించాలి. దైవ పూజలలో దీనిని ప్రవేశపెట్టాలి. మనసువుంది, యీ మనస్సు ఎందుకోసం? ఏదో లోకచింతలు చేయటానికా మనసు? కాదు కాదు. దైవచింతన చేయటానికి మనసు కావాలి. పరుల మంచిని కోరటానికి మనసు కావాలి. అప్పుడే మానవత్వము సార్థకమవుతుంది. దివ్యాత్మస్వరూపులారా! మీరు భగవత్ప్రేమకు గురికండి.

**నీకే కానివాడనైతే లోకమాతా!**
**నేను లోకమందు లోకువాడు లోకమాతా!**

ప్రకృతికి సరైన ఆదర్శము యిచ్చే విద్యార్థులు కావాలి, వ్యక్తులుగా మారాలి. మన జీవితము పరోపకారసంబంధముగా త్యాగము చేయాలి. కనుక, ప్రేమతత్త్వాన్ని పెంచుకోండి. లోకములో యుగయుగములనుంచి అలాంటి అవతార పురుషులను అందించినటువంటి ఆ మహా తల్లులు ఎంత గొప్పవారో యోచన చేసుకోవచ్చును. వారి హృదయమును పురస్కరించుకొనియే దివ్యమైన అవతారాలు దిగివచ్చాయి. యీనాడు అలాంటి తల్లులు లేరు. యీనాడు 'మదర్స్ డే' అని పెట్టుకోటంలో వున్న అంతరార్థము ఏమిటి? అలాంటి తల్లులుగా తయారుకావాలి. అలాంటి తండ్రులుగా తయారుకావాలి. లేకపోతే కొడుకులు

srisathyasaivachanamrutam

కనటం తండ్రియొక్క లక్షణమా? యిది కేవలము అవలక్షణము. ఆ కొడుకును సరైన మార్గములో పెట్టటము, తానుకూడా సరైన మార్గములో వుండినప్పుడే యీ తండ్రి, తండ్రి. లేక తండ్రికి బుద్ధి చెప్పి 'దుర్మార్గుడా! రాక్షసుడా! నీవు దైవభక్తి లేకుండా వుంటున్నావు. నీవు సరైన మార్గములో రమ్మ'ని చెప్పే కుమారులైనా తయారుకావాలి. ఈనాడు అలాంటి కుమారులులేరు. యిలాంటి తండ్రులు లేరు. అందువలన ప్రేమ పుత్రులుగా పెరగాలి. మనసును ప్రేమమయంగా మార్చుకోవాలి.

**(తేదీ 06-05-1992న త్రయీ బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam